## వరి పంటలో సస్యరక్షణకు చర్యలు

ఖానాపూర్, మార్చి 15 : వరి పంటలో ఉస తిరుగుడు నివారణకు తగిన సస్యరక్షణ చర్యలు చేపడితే ఆశించిన దిగుబడి లభిస్తుందని ఖానాపూర్ ఏవో జగదీశ్వర్ సూచించారు. శనివారం నిర్మల్ జిల్లా ఖానాపూర్‌లోని వ్యవసాయ శాఖ కార్యాలయంలో ఆయన విలేకరులతో మాట్లాడారు. వరి పొట్ట దశలో మొగి పురుగు ఆశించినట్లయితే కెల్డన్ లేదా నాగార్జున 4జీ గులికలను ఎకరాకు 8 కిలోలు చల్లుకోవాలని అన్నారు. మొగి రోగం ఎక్కువగా ఉన్నట్లయితే ఆయా క్లస్టర్ల ఏఈవోలను లేదా మండల వ్యవసాయ శాఖ కార్యాలయంలో సంప్రదించాలని సూచించారు.

## కొనసాగుతున్న డిగ్రీ అడ్మిషన్ క్యాంపెయిన్

ఎదులాపురం, మార్చి 15 : ఆదిలాబాద్‌లోని ప్రభుత్వ ఆర్ట్స్ కామర్స్ డిగ్రీ కళాశాలలో చేరాలని అడ్మిషన్స్ క్యాంపెయిన్ కొనసాగతుంది. 2025-26 విద్యా సంవత్సరంలో భాగంగా శనివారం ఇంటర్మీడియట్ ద్వితీయ సంవత్సరం పరీక్షలు కొనసాగుతున్న కేంద్రాల వద్ద కళాశాల సిబ్బంది కళాశాలలో కల్పిస్తున్న సౌకర్యాలు, వసతులపై అధ్యాపకులు వివరించారు. కరపత్రాలు, అనుభవజ్ఞులైన అధ్యాపకులచే విద్యాబోధన జరుగుతుందని, విద్యతో పాటు ఆటాపాటలు రాణించేందుకు ప్రత్యేక శ్రద్ధ తీసుకుంటామని వివరించారు. కార్యక్రమంలో అధ్యాపకులు నరేశ్, సద్, కుణాల్, గజానన్, శ్రీనివాస్, స్వామి పాల్గొన్నారు.



పైపులైన్ లీకేజీతో వృథాగా పోతున్న తాగునీరు

## వృథాగా మిషన్ భగీరథ నీరు

నిర్మల్ జిల్లా ఖానాపూర్‌లోని 10వ వార్డులో వారం రోజులుగా మిషన్ భగీరథ తాగునీరు పైపులైన్ లీకై రోడ్డు పొడువునా నీరు నిలిచిన నీరు చెరువును తలపిస్తోంది. అసలే వేసవి కాలం సమీపించిన నేపథ్యంలో ఇప్పటికే పలు కాలనీల్లో నీటి కటకట మొదలైంది. దీనికి తోడు లీకేజీ అయిన పైపులైన్‌కు మరమ్మతులు చేయకపోవడం వల్ల సమస్య మరింత తీవ్రమయ్యే అవకాశం ఉంది. ఇప్పటికైనా సంబంధిత అధికారులు తాగునీటి ఇబ్బందులు లేకుండా చూడాలని ప్రజలు కోరుతున్నారు.

-ఖానాపూర్ టౌన్, మార్చి 15



## ప్రమాదమని తెలిసినా..

తాంసి బస్టాండ్ సమీపంలో రైల్వేగేటు కింద నుంచి వెళ్తున్న వాహనదారులు

రైళ్ల రాకపోకల సమయంలో ఆదిలాబాద్‌లోని తాంసి బస్టాండ్ రైల్వేగేటు వేసి ఉన్న వాహనదారులు పట్టించుకోవడం లేదు. వాహనాలను వంపి గేటు కింది నుంచి తీసుకుని పోతున్నారు. శనివారం ఆదిలాబాద్ రైల్వే స్టేషన్‌లో నందిగ్రా ఎక్స్‌ప్రెస్ వస్తున్న సమయంలో కొందరు గేటు కింది నుంచి వెళ్లడం నమస్తే కెమెరాకు చిక్కింది. ఇలా వెళ్లడం ప్రమాదమని తెలిసిన జనం పట్టించుకోవడం లేదని విమర్శలు వస్తున్నాయి.

- ఆదిలాబాద్ ఫొటోగ్రాఫర్, మార్చి 15

## 17న సామాజిక తనిఖీ ప్రజావేదిక

నార్నూర్, మార్చి 15 : ఆదిలాబాద్ జిల్లా నార్నూర్‌లోని మండల ప్రజా పరిషత్ కార్యాలయంలో ఈ నెల 17వ తేదీన సామాజిక తనిఖీ ప్రజావేదికను నిర్వహించనున్నట్లు ఈజీఎస్ ఏపీవో జాదవ్ సురేశ్ శనివారం ఒక ప్రకటనలో తెలిపారు. మండలంలోని 23 గ్రామ పంచాయతీ పరిధిలో 2023-24 మార్చి 31వ తేదీ వరకు ఈజీఎస్ ద్వారా చేపట్టిన పనులకు రూ.9,17,25,570 ఖర్చు చేయడం జరిగింది. దీనిపై వారంలో రోజుల నుంచి 12 తనిఖీ బృందాలు తనిఖీ చేపడుతున్నట్లు పేర్కొన్నారు. సోమవారం ఉదయం సామాజిక తనిఖీ ప్రజా వేదికను నిర్వహించనున్నందున అధికారులు, నాయకులు, కూలీలు హాజరుకావాలని కోరారు.

## డయల్ యువర్ డీఎంకు విశేష స్పందన

భైంసా, మార్చి 15 : డయల్ యువర్ డీఎంకు విశేష స్పందన లభించిందని ఆర్టీసీ డిపో మేనేజర్ హరి ప్రసాద్ తెలిపారు. 13 వరకు అర్జీలు వచ్చాయని వాటిని పరిశీలిస్తామని పేర్కొన్నారు. అంతేగాకుండా సూచనలు, సలహాలు అందించిన వారికి ధన్యవాదాలు తెలిపారు.

## విద్యార్థులు లక్ష్యంతో చదువుకోవాలి




నృత్యం చేస్తున్న విద్యార్థులు

భైంసా, మార్చి 15 : విద్యార్థులు లక్ష్యంతో చదువుకోవాలని ముథోల్ ఎమ్మెల్యే రామరావు పటేల్ అన్నారు. శనివారం నిర్మల్ జిల్లా భైంసాలోని సంస్కార్ పాఠశాలలో వార్షికోత్సవం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ విద్యార్థులు ప్రణాళికంగా చదువుకుంటూ ముందుకు సాగాలన్నారు. అనంతరం విద్యార్థులు చేసిన నృత్యాలు ఆకట్టుకున్నాయి. కార్యక్రమంలో ఉపాధ్యాయులు, విద్యార్థులు, తదితరులు పాల్గొన్నారు.

## పిల్లలపై ప్రత్యేక దృష్టి సారించాలి

దస్తురాబాద్, మార్చి 15 : ఎండలు ముదురుతున్న నేపథ్యంలో తల్లిదండ్రులు పిల్లలపై ప్రత్యేక దృష్టి సారించాలని ఆయా పాఠశాలల ప్రధానోపాధ్యాయులు అన్నారు. నిర్మల్ జిల్లా దస్తురాబాద్ మండలంలోని ప్రభుత్వ పాఠశాలలో శనివారం పోషకులతో సమావేశం నిర్వహించారు. పిల్లలను ప్రతి రోజూ పాఠశాలకు పంపించాలని సూచించారు. పెర్కపల్లె గ్రామంలోని ప్రభుత్వ పాఠశాలలో విద్యార్థుల యొక్క సామర్థ్యాలను పరీక్షించారు. ప్రతిభ కనబర్చిన విద్యార్థులకు వారి తల్లిదండ్రులతో బహుమతులు అందజేశారు. కార్యక్రమంలో ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.

# నాలుగో రోజుకు చేరిన ఎమ్మార్పీఎస్ దీక్షలు



ఎదులాపురం: నిరాహారదీక్షలో కూర్చున్న ఎమ్మార్పీఎస్ నాయకులు

ఎదులాపురం, మార్చి 15 : ఎస్సీ వర్గీకరణ చట్టాన్ని ఆమోదించకుండా ఉన్నత ఉద్యోగాల ఫలితాలను సీఎం రేవంత్ రెడ్డి వెల్లడించి మాదిగలకు తీవ్ర అన్యాయం చేశారని ఎమ్మార్పీస్ జిల్లా అధ్యక్షుడు ఆరెల్లి మల్లేశ్ ఆరోపించారు. ఎస్సీ రిజర్వేషన్ల వర్గీకరణ చట్టం వచ్చేంత వరకు అన్ని రకాల ఉద్యోగ ఫలితాలు నిలిపి వేయాలని డిమాండ్ చేస్తూ ఎమ్మార్పీస్ ఆధ్వర్యంలో ఆదిలాబాద్ కలెక్టరేట్ ఎదుట చేపట్టిన నిరసన దీక్షలు శనివారం 4వ రోజుకు చేరుకున్నాయి. దీక్షలో ప్రభుత్వానికి వ్యతిరేకంగా నినాదాలు చేశారు. ఈ సందర్భంగా ఎమ్మార్పీస్ జిల్లా అధ్యక్షుడు ఆరెల్లి మల్లేశ్ మాట్లాడుతూ వర్గీకరణ చట్టాన్ని అమలు చేయకుండా ఉద్యోగాల ఫలితాలను ఇస్తూ భర్తీకి చర్యలు చేపడుతున్నారన్నారు. మాలల ఒత్తిడికి తలొగ్గి మాదిగలకు అన్యాయం చేసేల రాష్ట్ర ప్రభుత్వం వ్యవహరిస్తున్నదని ఆరోపించారు. ఇదే పంతను కొనసాగిస్తే మాదిగలు ఆగ్రహానికి గురికాకతప్పదని హెచ్చరించారు. కార్యక్రమంలో ఎమ్మార్పీస్ సీనియర్ నాయకులు మనోజ్, శంకర్, దేవీదాస్, స్వామి, అశోక్, రాజు, దేవన్న, హన్మాండ్లు, శ్రీకాంత్, నవీన్ పాల్గొన్నారు.



బోథ్: మాట్లాడుతున్న ఎమ్మార్పీఎస్ రాష్ట్ర నాయకుడు కూడల స్వామి

బోథ్, మార్చి 15: అసెంబ్లీలో సుప్రీంకోర్టు తీర్పును అమలు చేస్తూ శాస్త్రీయబద్ధంగా ఎస్సీ వర్గీకరణకు చట్టబద్ధత కల్పించాలని ఎమ్మార్పీఎస్ రాష్ట్ర నాయకుడు కూడల స్వామి డిమాండ్ చేశారు. ఆదిలాబాద్ జిల్లా బోథ్ బస్టాండ్ ఎదుట చేపట్టిన నిరసన దీక్ష శనివారం నాలుగో రోజుకు చేరుకుంది. కార్యక్రమంలో నాయకులు కారేం రవి, బిక్కు రమణయ్య, బత్తిని గంగయ్య పాల్గొన్నారు.

# వేర్వేరు కారణాలతో ముగ్గురు ఆత్మహత్య

పెంబి, మార్చి 15: మద్యం మత్తులో పురుగుల మందు తాగి యువకుడు ఆత్మహత్య చేసుకున్న ఘటన నిర్మల్ జిల్లా పెంబి మండలంలోని తులసిపేట్ గ్రామంలో చోటు చేసుకుంది. ఎస్ఐ హన్మాండ్లు తెలిపిన వివరాల ప్రకారం.. తులసిపేట్ గ్రామానికి చెందిన మూట గంగాధర్(26)కు నాలుగు సంవత్సరాల క్రితం వివాహమైంది. సంతానం లేకపోవడంతో కలతచెందుతూ మద్యానికి బానిసయ్యాడు. మద్యం మానేయాలని కుటుంబ సభ్యులు మందలించారు. మద్యం మత్తులో ఇంట్లో ఉన్న పురుగుల మందు తాగి ఆత్మహత్య చేసుకున్నాడు. మృతుడికి భార్య ఉన్నారు. కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ తెలిపారు.

### మద్యానికి బానిసై..

బజార్‌హత్నూర్, మార్చి 15 : ఆదిలాబాద్ జిల్లా బజార్‌హత్నూర్ మండలం రాంనగర్ గ్రామానికి చెందిన గేడం గంగారం(54) మద్యానికి బానిసై శనివారం ఊరివేసుకుని ఆత్మహత్య చేసుకున్నాడు. ఎస్ఐ అప్పారావు తెలిపిన వివరాల ప్రకారం.. గేడం గంగారం గత కొంత కాలంగా మద్యానికి బానిసయ్యాడు. జీవితంపై విరక్తి చెంది శనివారం మధ్యాహ్న సమయంలో గ్రామానికి దగ్గరలో ఉన్న పంట పొలంలో ఊరివేసుకుని మృతి చెందాడు. ఈ విషయం తెలుసుకున్న పోలీసులు ఘటనా స్థలానికి చేరుకుని పంచనామ నిర్వహించారు. మృతుని కుమారుడు అజయ్ ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ తెలిపారు.

### పురుగుల మందు తాగి...

ఇంద్రవెల్లి, మార్చి 15: ఆదిలాబాద్ జిల్లా ఇంద్రవెల్లి మండలం మర్కాగూడ గ్రామపంచాయతీ పరిధిలోని బుర్సన్‌పటార్ గ్రామానికి చెందిన సోన్‌కాంబ్లే విద్యాసాగర(57) పురుగుల మందు తాగి ఆత్మహత్య చేసుకున్నట్లు ఎస్ఐ సునీల్ తెలిపారు. ఎస్ఐ తెలిపిన వివరాల ప్రకారం...సోన్‌కాంబ్లే విద్యాసాగర్ వ్యవసాయ పనులతో పాటు ఇతర కూలీ పనులు చేస్తూ కుటుంబాన్ని పోషిస్తున్నాడు. శుక్రవారం హోలీ పండుగ సంబురాల్లో భాగంగా అతిగా మద్యం తాగడు. సాయంత్రం వ్యవసాయ పనులకు వెళ్లిన విద్యాసాగర్ తాగిన మైకంలో చేనులో ఉన్న పురుగుల మందు తాగి స్పృహ కోల్పోయాడు. గమనించిన స్థానికులు వెంటనే కుటుంబీకులకు సమాచారం అందించారు. 108లో ఆదిలాబాద్ రిమ్స్‌కు తరలించారు. చికిత్స పొందుతూ మృతి చెందాడు. పోలీసులు రిమ్స్ దవాఖానను సందర్శించి మృతికి గల కారణాలు అడిగి తెలుసుకున్నారు. మృతుడి కుమారుడు సోన్‌కాంబ్లే కిరణ్ ఇచ్చిన ఫిర్యాదు మేరకు పంచనామ నిర్వహించి పోస్టుమార్టంకు తరలించినట్లు తెలిపారు. కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ సునీల్ తెలిపారు.

## చలో ఢిల్లీ పోస్టర్ ఆవిష్కరణ

నిర్మల్ అర్బన్, మార్చి 15: భవన నిర్మాణ కార్మికుల సమస్యలు పరిష్కరించాలని డిమాండ్ చేస్తూ శనివారం సీపీఐ కార్యాలయంలో చలో ఢిల్లీ పోస్టర్‌ను ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఏఐటీయూసీ నాయకుడు విలాస్ మాట్లాడుతూ భవన నిర్మాణ కార్మికుల సమస్యలు పరిష్కరించడంలో ప్రభుత్వాలు నిర్లక్ష్యం చేస్తున్నాయన్నారు. వారిని ఆదుకోవాలని డిమాండ్ చేస్తూ ఈ నెల 20వ తేదీన నిర్వహించే చలో ఢిల్లీ కార్యక్రమానికి భవన నిర్మాణ కార్మికులు హాజరుకావాలని కోరారు.

# 27న బార్ అసోసియేషన్ ఎన్నికలు



ఎన్నికల నోటిఫికేషన్ విడుదల చేస్తున్న అధికారులు

ఎదులాపురం, మార్చి 15 : ఆదిలాబాద్ బార్ అసోసియేషన్ కాలపరిమితి ముగియడంతో ఈ 27వ తేదీన ఎన్నికలు నిర్వహించనున్నట్లు ఎన్నికల అధికారి డాక్టర్ పీ డేవిడ్ తెలిపారు. శనివారం జిల్లా కేంద్రంలోని బార్ అసోసియేషన్ కార్యాలయంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఎన్నికల నోటిఫికేషన్ విడుదల చేశారు. ఈ నెల 17 నుంచి 20వ తేదీ వరకు ఉదయం 10.30 నుంచి మధ్యాహ్నం 2 గంటల వరకు నామినేషన్ల స్వీకరణ ఉంటుందని పేర్కొన్నారు. 21న పరిశీలన, అభ్యర్థుల జాబితా ప్రదర్శన, 22న నామినేషన్ల ఉపసంహరణ, 27న ఎన్నికలు, లెక్కింపు ఉంటుందని తెలిపారు. ఏప్రిల్ 1న నూతన కార్యవర్గానికి బాధ్యతల ఇవ్వడం జరుగుతుందని పేర్కొన్నారు. ఎన్నికలకు సంబంధించి ఏర్పాట్లు పూర్తి చేశామన్నారు. ఆయన వెంట అసిస్టెంట్ ఎన్నికల అధికారులుగా వై వినోద్ రెడ్డి, ఎండీ అబ్దుల్లా ఖాన్ వ్యవహరిస్తారని పేర్కొన్నారు.

## పేకాట స్థావరంపై దాడి

కడెం, మార్చి 15 : నిర్మల్ జిల్లా కడెం మండలం కొండుకూర్ గ్రామ సమీపంలోని ఫామ్‌హౌస్ వద్ద పేకాట స్థావరంపై శనివారం పోలీసులు దాడి చేశారు. ఇందులో కడెం మండలంలోని కొండుకూర్ గ్రామానికి చెందిన వారు నిర్వాహకులుగా ఉండగా, పోలీసుల దాడిలో 18 మంది పట్టుబడ్డారు. వారిని అదుపులోకి తీసుకున్నట్లు పోలీసులు తెలిపారు.

## వేర్వేరు రోడ్డు ప్రమాదాల్లో పలువురికి గాయాలు

ఎదులాపురం, మార్చి 15 : ఆదిలాబాద్‌లోని సంజయ్ నగర్ సమీపంలో శనివారం జరిగిన రోడ్డు ప్రమాదంలో నలుగురికి గాయాలయ్యాయి. జిల్లా పోలీసు కార్యాలయం ఎదుట ఆటోను ద్విచక్రవాహనం ఢీ కొట్టింది. ద్విచక్రవాహనంపై ప్రయాణిస్తున్న రేవంత్, నిలకంఠతో పాటు ఆటోలో ఉన్న శ్రీనివాస్, ఆయన భార్యకు గాయాలయ్యాయి. సంజయ్‌నగర్ వైపు నుంచి ద్విచక్రవాహనంపై వస్తున్న యువకులు ఎదురుగా వస్తున్న ఆటోను ఢీ కొట్టడంతో ప్రమాదం జరిగింది. గమనించిన స్థానికులు క్షతగాత్రులను 108 ద్వారా రిమ్స్‌కు తరలించారు. ఈ విషయం తెలుసుకున్న పోలీసులు రిమ్స్‌లో వివరాలు సేకరించారు.

నర్సాపూర్ (జీ), మార్చి 15 : నిర్మల్ జిల్లా నర్సాపూర్(జీ) మండలంలోని నసీరాబాద్ సమీపంలో జరిగిన రోడ్డు ప్రమాదంలో ఒకరికి తీవ్ర గాయాలయ్యాయి. పోలీసుల తెలిపిన వివరాల ప్రకారం.. ఎడ్దూర్, పొట్ పల్లి గ్రామానికి చెందిన గంజిగం కార్తీక్ శనివారం ఉదయం నిర్మల్ నుంచి వారి ఇంటికి బైక్‌పై వెళ్తున్నాడు. నసీరాబాద్ గ్రామ మలుపు వద్ద చాక్‌పల్లి గ్రామానికి చెందిన షాదుల్లా చాక్‌పల్లి నుంచి నిర్మల్ వైపు టీవీఎస్ ఎక్సెల్‌తో అతివేగంగా అజాగ్రత్తగా నడుపుతూ ఎదురుగా వస్తున్న గంజిగం కార్తీక్ బైక్‌ను ఢీ కొట్టాడు. ఈ ప్రమాదంలో కార్తీక్ ఎడమ కాలు విరిగింది. వెంటనే స్థానికులు చికిత్స నిమిత్తం 108లో నిర్మల్ ప్రభుత్వ దవాఖానకు తరలించారు. తన తండ్రి గంజిగం సాయినాథ్ పోలీస్ స్టేషన్ నర్సాపూర్ యందు ఫిర్యాదు చేయగా కేసు నమోదు చేసి విచారణ చేపడుతున్నామని ఎస్ఐ సాయికిరణ్ తెలిపారు.

## లక్ష్మణచాంద ఎస్ఐ బదిలీ

లక్ష్మణచాంద, మార్చి 15: నిర్మల్ జిల్లా లక్ష్మణచాంద ఎస్ఐగా పని చేసిన సుమలత శనివారం బదిలీపై వెళ్లారు. మండల తొలి మహిళ ఎస్ఐగా 2024 జూన్ 9వ తేదీన బాధ్యతలు స్వీకరించారు. ఎనిమిది నెలలుగా విధులు నిర్వహించారు. నిర్మల్‌లోని భరోసా కేంద్రానికి బదిలీపై వెళ్లారు. ప్రొబెషనరీ ఎస్ఐగా పని చేస్తున్న షేక్ జుబేర్ ఇన్ చార్జి ఎస్ఐగా బాధ్యతలు స్వీకరించారు.

# మహిళలు అన్ని రంగాల్లో రాణించాలి

ముథోల్, మార్చి 15 : మహిళలు అన్ని రంగాల్లో రాణించాలని ఎస్ఐ సంజీవ్ అన్నారు. శనివారం ముథోల్‌లో నారిశక్తి కార్యక్రమంలో భాగంగా మహిళా పోలీసు అధికారులు బ్లూకోర్టు విధులు నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ మహిళలు అనుకుంటే సాధ్యం కానిది ఏది లేదని పేర్కొన్నారు. మహిళలు పురుషుల కంటే దేనిలో తక్కువ కాదని నిరూపించుకోవాలన్నారు.



దస్తురాబాద్ : వాహనాలు తనిఖీ చేస్తున్న మహిళా కానిస్టేబుళ్లు

దస్తురాబాద్, మార్చి15 : నారిశక్తి కార్యక్రమంలో భాగంగా నిర్మల్ జిల్లా దస్తురాబాద్‌లోని పోలీస్ స్టేషన్‌లో విధులు నిర్వహిస్తున్న మహిళా కానిస్టేబుళ్లు రజిత, కళ్యాణి శనివారం బ్లూ కోట్స్, డయల్ 100 విధులను నిర్వహించారు. మండల కేంద్రంలోని బస్టాండ్ ప్రాంతంలో వాహనాలను తనిఖీ చేశారు. పెండింగ్‌లో ఉన్న చలాన్లను పరిశీలించి జరిమానాను విధించారు. కార్యక్రమంలో పోలిస్ సిబ్బంది పాల్గొన్నారు.

## వెంకట్‌కు డాక్టర్ ఆఫ్ తెలుగు రిటరేషన్ అవార్డు



అవార్డు అందుకుంటున్న వెంకట్

నిర్మల్ అర్బన్, మార్చి 15: నిర్మల్‌కు చెందిన ప్రముఖ పద్యకవి వెంకట్ డాక్టర్ ఆఫ్ తెలుగు రిటరేషన్ అవార్డును శనివారం హైదరాబాద్‌లో అందుకున్నారు. ఆయన 31 సంవత్సరాలుగా సంస్కృతంలో, తెలుగు భాషపై సాహిత్య సేవలను అందించినందుకుగాను ఈ అవార్డును చైర్మన్ అలూరి విల్సన్ చేతుల మీదుగా అందుకున్నారు. అవార్డును అందుకున్న వెంకట్‌ను పలువురు కవులు, కళాకారులు, అభినందించారు.

# శనగల కొనుగోలు ప్రారంభం



శనగల కొనుగోళ్లు ప్రారంభిస్తున్న చైర్మన్ కిశోర్‌సింగ్

నేరడిగొండ, మార్చి 15 : ఆదిలాబాద్ జిల్లా నేరడిగొండలోని పీఏసీఎస్ కార్యాలయ ఆవరణలో మార్క్‌ఫెడ్ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన శనగల కొనుగోళ్లను శనివారం పీఏసీఎస్ చైర్మన్ సాబ్లే కిశోర్‌సింగ్ ప్రారంభించారు. క్వింటాల్ శనగల ధర రూ.5650 చెల్లించడం జరుగుతుందని తెలిపారు. కార్యక్రమంలో మాజీ ఎంపీపీ రాథోడ్ సజన్, పీఏసీఎస్ మాజీ చైర్మన్ నానక్‌సింగ్, వైస్ చైర్మన్ వెంకటరమణ, వీడీసీ చైర్మన్ రవీందర్‌రెడ్డి, మార్కెట్ కమిటీ చైర్మన్ గంగారెడ్డి, నాయకులు శ్రీనివాస్‌రెడ్డి, ప్రతాప్‌సింగ్, గులాబ్‌సింగ్, శ్రీకాంత్‌రెడ్డి, వసంత్, సంజీవ్, రాజుయాదవ్, మండల వ్యవసాధికారి కృష్ణవేణి, సీఈవో నాగభూషణ్, సిబ్బంది, రైతులు పాల్గొన్నారు.

# కేంద్రం జీవో 3ను పునరుద్ధరణ చేయాలి




మాట్లాడుతున్న టీఏజీఎస్ రాష్ట్ర కార్యదర్శి పూసం సచిన్

ఎదులాపురం, మార్చి 15 : కేంద్రం జీవో 3ను పునరుద్ధరణ చేయాలని లేకుంటే ఆదివాసులకు ఉద్యోగాలు ఉండవని టీఏజీఎస్ రాష్ట్ర కార్యదర్శి పూసం సచిన్ అన్నారు. శనివారం, ఆదివారం ఆదివాసీ అధికార రాష్ట్రయ్ మంచ్ (ఏఏఆర్ఎం) జాతీయ సమావేశాలు బెంగళూర్‌లో జరుగుతున్నాయి. ఈ సందర్భంగా తెలంగాణ నుంచి ప్రతినిధిగా పూసం సచిన్ హాజరై మాట్లాడారు. తెలుగు రాష్ట్రాల్లో జీవో 3ను పునరుద్ధరణ చేసే అధికారం కేంద్ర ప్రభుత్వానికి మాత్రమే ఉన్నదన్నారు. ఆదివాసులపై బీజేపీ ప్రభుత్వానికి నిర్లక్ష్యం మూలంగా అనేక నోటిఫికేషన్ లేక వేలాది ఉద్యోగాలను కోల్పోయారని అన్నారు. సుప్రీం కోర్టు తీర్పు నేపథ్యంలో కేంద్రం ఇది చేయాల్సిన అవసరం ఉందన్నారు. 5వ షెడ్యూల్ ప్రాంతంలో ఆదివాసీ యువత తమ కీలకమైనా హక్కులను కోల్పోయినట్లు అన్నారు. తక్షణమే ఆర్డినెన్స్ ద్వారా పార్లమెంట్‌లో సింపుల్ మెజారిటీ ద్వారా వెంటనే ఆదివాసీ యువత భవిష్యత్ కోసం తగిన నిర్ణయం చేయాలని డిమాండ్ చేశారు. బీజేపీ ఆదివాసీ వ్యతిరేక విధానాలకు నిరసనగా దేశ వ్యాప్తంగా ఉద్యమాలు నిర్వస్తామని తెలిపారు.

## వంట పాత్రలు అందజేత



వంట పాత్రలు అందజేస్తున్న ఎంఈవో కసావత్ బిక్కు

ఇచ్చోడ, మార్చి 15 : ఆదిలాబాద్ జిల్లా ఇచ్చోడ మండలంలోని ప్రభుత్వ పాఠశాలలకు ప్రభుత్వం నుంచి వచ్చిన మధ్యాహ్న భోజనానికి సంబంధించిన వంటపాత్రలను శనివారం ఎంఈవో కసావత్ బిక్కు ప్రధానోపాధ్యాయులకు పంపిణీ చేశారు. కార్యక్రమంలో ఎమ్మార్సీ స్టాఫ్, సీసీవో, సీఆర్పీలు సురేశ్, శ్యాంసుందర్, రవీందర్, గంగాభవాని, రాజు పాల్గొన్నారు.

# సమస్యలు పరిష్కరించాలి



మాట్లాడుతున్న జడ్పీ సీఈవో జితేందర్‌రెడ్డి

నార్నూర్, మార్చి 15 : ప్రజల సమస్యలు పరిష్కరించాలని జడ్పీ సీఈవో జితేందర్‌రెడ్డి అన్నారు. ఆదిలాబాద్ జిల్లా నార్నూర్‌లోని రైతు వేదికలో బహిరంగ విచారణ వేదికను శనివారం నిర్వహించారు. పలు సమస్యలతో వచ్చిన అర్జీలను పరిశీలించారు. సంబంధిత శాఖ అధికారులతో చర్చించి సమస్యలు పరిష్కారానికి కృషి చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రజలు ఇబ్బంది పడకుండా సమస్యలు తక్షణమే పరిష్కరించేలా చూడాలని సంబంధిత శాఖ అధికారులకు సూచించారు. కార్యక్రమంలో మండల ప్రత్యేకాధికారి గంగాధర్, ఎంపీడీవో జవహర్‌లాల్ పాల్గొన్నారు.

## కేంద్ర ఉద్యోగం సాధించిన ప్రశాంత్ కుమార్

ఎదులాపురం, మార్చి 15 : ఆదిలాబాద్‌లోని అగ్రజా టౌన్‌షిప్‌కు చెందిన మొట్టె లింగమ్మ - నరేంద్ర ప్రసాద్ దంపతుల రెండవ కుమారుడు మొట్టె ప్రశాంత్ కుమార్ ఇటీవల స్టాఫ్ సెలక్షన్ కమిషన్- సీజీఎల్-2024 వెల్లడించిన ఫలితాల్లో టీఏఎల్ అసిస్టెంట్ ఆఫ్ ఫర్మ్ సెంట్రల్ బోర్డ్ ఆఫ్ డైరెక్ట్ టాక్సెస్ విభాగంలో కేంద్ర ప్రభుత్వ ఉద్యోగం సాధించాడు. తండ్రి నరేంద్ర ప్రసాద్ తలమడుగు మండలం పల్లి(బీ) ప్రాథమిక పాఠశాలలో ప్రధానోపాధ్యాయుడుగా విధులు నిర్వహిస్తున్నాడు. ఇటీవల డీఎస్సీ ఫలితాల్లో సోదరుడు ప్రసన్నకుమార్ కూడా ఉపాధ్యాయుడిగా ఎంపిక కావడం విశేషం.

## కళాశాలలో చేరాలని అధ్యాపకుల ప్రచారం

నిర్మల్ అర్బన్, మార్చి 15 : నిర్మల్ ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో చేరాలని శనివారం అధ్యాపకులు విస్తృత ప్రచారం నిర్వహించారు. ఇంటర్ పరీక్షలు జరుగుతున్న పరీక్షా కేంద్రాల వద్దకు వెళ్లి పరీక్ష అనంతరం విద్యార్థులకు కరపత్రాలు పంపిణీ చేశారు. ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో ఉన్న వసతులు, గత విద్యార్థుల ప్రగతిని వివరించి కళాశాలలో చేరాలని కోరారు. కార్యక్రమంలో అధ్యాపకులు గంగాధర్, జాకీర్, హుస్సేన్, సూర్య సాగర్, శ్రీనివాస్, రమేశ్, సుభాష్, అర్చన, శ్రీహరి, పవన్ కుమార్, రజిత, ఉమేశ్ పాల్గొన్నారు.

## ఉచిత డ్రైవింగ్ శిక్షణకు దరఖాస్తుల ఆహ్వానం

ఎదులాపురం, మార్చి 15: నిరుద్యోగ బీసీ యువతీ యువకుల కోసం బీసీ సహకార ఆర్థిక సంస్థ లిమిటెడ్ ఆధ్వర్యంలో రోడ్డు రవాణా సంస్థ ద్వారా ఉచిత హెవీ మోటర్ డ్రైవింగ్ వాహనం ఉచిత శిక్షణకు దరఖాస్తులు ఆహ్వానిస్తున్నట్లు జిల్లా బీసీ అభివృద్ధి శాఖ అధికారి కే రాజలింగు ఒక ప్రకటనలో తెలిపారు. హైదరాబాద్ ఆర్టీసీ హకీంపేట్ నుంచి ఉచిత హెవీ డ్రైవింగ్ కోర్సులు, లైట్ మోటర్ వెకిల్ శిక్షణకు దరఖాస్తులు చేసుకోవాలని పేర్కొన్నారు. 38 రోజులు (304) గంటలు శిక్షణ ఉంటుందన్నారు. శిక్షణ అనంతరం రవాణా సంస్థలో అర్హత కలిగి ఉన్న అభ్యర్థులకు పర్మినెంట్ లైసెన్స్ ఉచితంగా అందిస్తామన్నారు. శిక్షణ కాలంలో హైదరాబాద్ హకీంపేట్‌లో ఉచిత భోజనం వసతి కల్పించడం జరుగుతుందన్నారు. కనీసం 8వ తరగతి ఉత్తీర్ణులై ఉన్నవారు అర్హులన్నారు. (ఎల్ఎంవీ) కోసం 18 నుంచి 45 సంవత్సరాలు, (హెచ్ఎంవీ) కోసం 20 సంవత్సరాల నుంచి 45 సంవత్సరాలు వయస్సు ఉండాలన్నారు. అభ్యర్థుల ఆధార్, కుల, ఆదాయ, ధ్రువీకరణ పత్రాలతోపాటు మూడు పాస్ ఫొటోలు తీసుకోవాలన్నారు. అన్ని ధ్రువీకరణ పత్రాలను ఈ నెల 15 నుంచి 31వ తేదీ వరకు సాయంత్రం 5 గంటల వరకు జిల్లా బీసీ అభివృద్ధి కార్యాలయంలో సమర్పించాలన్నారు. ఆసక్తి కలిగిన బీసీ నిరుద్యోగ యువతీ యువకులతో పాటు ట్రాన్స్ జెండర్లు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని సూచించారు.

## నూతన ఎస్పీని కలిసిన సభ్యులు



ఎస్పీకి మొక్క అందజేస్తున్న అసోసియేషన్ సభ్యులు

ఎదులాపురం, మార్చి 15: ఆదిలాబాద్ ఎస్పీగా బాధ్యతలు స్వీకరించిన అఖిల్ మహాజన్‌కు సార్క్ నేషన్స్ ఇంటర్నేషనల్ హ్యూమన్ రైట్స్ అసోసియేషన్ తరపున పూల మొక్క అందజేసి శాలువాతో సన్మానించారు. సార్క్ హ్యూమన్ రైట్స్ చేసే కార్యక్రమాలు వివరించారు. కలిసిన వారిలో ఉమ్మడి జిల్లా ప్రధాన కార్యదర్శి నీరటి ఉదయ్ కిరణ్, ఆదిలాబాద్ జిల్లా చైర్మన్ రాజ్ సిద్దార్థ, సభ్యులు ఆలం, లక్ష్మణ్ పాల్గొన్నారు.

## నలుగురు మట్కా నిందితుల అరెస్ట్

ఎదులాపురం, మార్చి 15: ఆదిలాబాద్‌కు చెందిన నలుగురు మట్కా నిందితులను టూ టౌన్ పోలీసులు అరెస్టు చేశారు. పట్టణంలోని గాంధీనగర్‌లో మట్కా నిర్వహిస్తున్నారనే పక్కా సమాచారం రావడంతో పోలీసులు దాడులు నిర్వహించారు. నలుగురు వ్యక్తుల నుంచి రూ.3200 నగదు, 17 మట్కా చిటీలను స్వాధీనం చేసుకున్నారు. ఇందిరానగర్‌కు చెందిన అబ్దుల్ ఫరీద్, భుక్తాపూర్‌కు చెందిన షేక్ అజీమ్, గాంధీనగర్‌కు చెందిన మారుతి, చిల్కూరిలక్ష్మినగర్‌కు చెందిన షేక్ అలీమ్‌ను అరెస్ట్ చేసినట్లు టూ టౌన్ సీఐ కరుణాకర్ రావ్ తెలిపారు. వీరిని ప్రోత్సహిస్తున్న మునీర్ పరారీలో ఉన్నట్లుగా పేర్కొన్నారు.

## బాధిత కుటుంబానికి ఆర్థిక సాయం



ఆర్థిక సాయం అందజేస్తున్న చౌకధర దుకాణాల డీలర్లు

నార్నూర్, మార్చి 15 : ఆదిలాబాద్ జిల్లా గాదిగూడ మండలం పర్సువాడ(కే) గ్రామానికి చెందిన చౌకధర దుకాణం డీలర్ పెందోర్ విఠల్ అనారోగ్యంతో శనివారం మృతి చెందాడు. ఈ విషయం తెలుసుకున్న అధికారులు, రేషన్ డీలర్లు విఠల్ ఇంటికి వెళ్లి కుటుంబాన్ని పరామర్శించారు. డీలర్ల సంఘం తరపున బాధిత కుటుంబానికి తమ వంతు ఆర్థికసాయం అందజేశారు. ఇక్కడ ఎన్‌ఫోర్స్‌మెంట్ డీటీ మధుసూదన్, కంప్యూటర్ ఆపరేటర్ కేశవ్, ఫీల్డ్ ఇంజినీరింగ్ రాందాస్, డీలర్ల సంఘం మండలాధ్యక్షుడు జంగు, ప్రభు, దశరథ్, వెంకట్, పవన్, వామన్ ఉన్నారు.